సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 12, ఏప్రిల్, 2023



వేర్వేరు కేసుల్లో నిందితుల అరెస్ట్

హత్యాయత్నం కేసులో ముగ్గురు, పోక్సో యాక్ట్ కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం నెల్లూరు వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,360
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,570
3 శాతం జీఎస్టీతో	రూ.5,737
సవర (8 గ్రా)	రూ.45,896

గరిష్టం/కనిష్టం
37.7 /26.0

వాతావరణం

మంగళవారం గాలిలో 42 శాతం తేమ ఉంది. బుధవారం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



న్యూస్‌రీల్

నేడు హరినారాయణన్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(అర్బన్): జిల్లా కలెక్టర్‌గా నియమితులైన హరినారాయణన్ బుధవారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరులోని కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను అధికారులు కలవనున్నారు.

వచ్చే నెలలో ఇళ్లు అందించేలా చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న ప్రసన్నకుమార్

కందుకూరు అర్బన్: పట్టణంలోని ఉప్పుచెరువు సమీపంలో జీ+3 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు మే మొదటి వారంలో అందించేలా చర్యలు చేపట్టాలని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. పనుల్లో పురోగతిని టిడ్కో ఇంజినీర్లతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. మ్యాప్ చూసి కమిషనర్ ఎస్.మనోహర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత కాలవ్యవధి లోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు అధికారులు, ఏజెన్సీ సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ జీ+3లో బ్యాంకు రుణం తీసుకొని రిజిస్ట్రేషన్ చేసిన లబ్ధిదారులకు మాత్రమే గృహాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.చినకోటేశ్వరరావు, ఈఈ జి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ ప్రణాళిక విభాగానికి చెందిన కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీస్ లాంఛనాలతో హవల్దార్ అంత్యక్రియలు



అంత్యక్రియలు జరుగుతున్న దృశ్యం

సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామపురానికి చెందిన మండ్ల ప్రసాద్ ఆర్మీలో హవల్దార్‌గా పనిచేస్తూ లడఖ్ ప్రాంతంలోని మంచుకొండల్లో జారిపడి చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఆయన మృతదేహాన్ని సీతారామపురంలోని నివాసానికి తీసుకొచ్చారు. పలువురు రాజకీయ నాయకులు, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ వి.గిరిబాబు, ఎస్సై కిశోర్‌బాబు, ఆర్మీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం

- నెల్లూరులోని పెద్దాస్పత్రిలో మాక్‌డ్రిల్
- ఆక్సిజన్ ప్లాంట్, రోగుల వార్డులను పరిశీలించిన వైద్యశాఖ అధికారులు
- జిల్లాలో ఫీవర్ సర్వే చేపట్టామని వెల్లడి



కోవిడ్ వార్డు వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధా నాయక్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తే ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్యశాఖ సర్వం సిద్ధం చేసింది. నెల్లూరులోని పెద్దాస్పత్రిలో కరోనా బాధితుల కోసం ఏర్పాటు చేసిన 100 పడకల పల్మనాలజీ వార్డు, క్యాజువాలిటీ వద్ద మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. వైరస్ సోకిన వారు 108, 104 వాహనాల ద్వారా ఆస్పత్రికి వస్తే ఎలా అడ్మిట్ చేసుకోవాలి?, ఎక్కడ బెడ్ కేటాయించాలి?, ఎవరెవరు అందుబాటులో ఉండాలి? తదితర విషయాలను పరిశీలించారు. ప్రధానంగా జగనన్న ప్రాణవాయువు ప్లాంట్, కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్, డీ టైప్ సిలిండర్లు, వెంటిలేటర్లు, ఆస్పత్రిలోని కోవిడ్ వార్డుల్లో వసతుల గురించి ప్రభుత్వ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ అధికారి డాక్టర్ రమేష్‌నాథ్, ఆర్‌ఎంఓ డాక్టర్ కళారాణి, డాక్టర్ అరుణ్‌కాంత్ తదితరులు ఆరాతీశారు. కోవిడ్ వార్డులో నేమ్ బోర్డు, ప్రతి బెడ్‌కు ఆక్సిజన్, మాస్కులు, పీపీఈ కిట్లు ఉన్నాయా? లేదా? అని తెలుసుకున్నారు.

సమృద్ధిగా ఉన్నాయి

ఈ సందర్భంగా సిద్ధానాయక్, పెంచలయ్య, రమేష్‌నాథ్ మాట్లాడుతూ కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వెంటిలేటర్లు, బెడ్లు, ఇతర పరికరాలు, అన్నిరకాల మందులను సమృద్ధిగా ఉంచామన్నారు. నర్సింగ్ సిబ్బందిని, శానిటరీ వర్కర్లను నియమించామన్నారు. కేసుల ఉధృతి పెరగకుండా ఇద్దరు బాధితులను ఐసోలేషన్ చేశామన్నారు. ప్రజలు సమూహాల్లోకి వెళ్లొద్దని సూచించారు. మాస్కులు ధరించి.. శానిటైజర్లు వినియోగిస్తూ తగిన రక్షణ చర్యలు చేపడితే కరోనా గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ర్యాండమ్‌గా 200 పరీక్షలు చేయమని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. తాము అంతకన్నా ఎక్కువగా పరీక్షలు చేస్తున్నామన్నారు. ఎవరికైనా జలుబు, దగ్గు, జ్వరం లాంటి లక్షణాలుంటే తక్షణమే కోవిడ్ పరీక్ష చేయించుకోవాలన్నారు. జిల్లాలో ఫీవర్ సర్వే చేపట్టామని తెలిపారు. ఫీవర్ కేసులను గుర్తించినప్పుడు వారందరికీ కరోనా పరీక్షలు చేయిస్తామన్నారు. జ్వరం ఉన్నవారు బయట తిరగకుండా ఇంటికే పరిమితం కావాలన్నారు. సమావేశంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి ఘన నివాళి



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి



నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మంగళవారం నెల్లూరులోని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. మంత్రి జ్యోతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే గొప్ప వ్యక్తి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మంచి రాజకీయంగా గుర్తింపు ఇచ్చారని కొనియాడారు.

- జ్యోతిరావు పూలే చిత్రపటానికి రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరులోని ఆయన నివాసంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది.

గతంలో కాగితాలకే అభివృద్ధి పరిమితం

- సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం
- రూ.7 కోట్లతో బిరదవోలు పంచాయతీ అభివృద్ధి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కాగితాలకే పరిమితం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనులు చేసి చూపుతోంది.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిరదవోలు, ముత్యాలపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో మంగళవారం మంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఇంకా రూ.96 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామాల పరిధిలోనే అన్ని రకాల పనులు చకచకా జరిగిపోతున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ హయాంలో మండల వ్యవస్థ తీసుకొస్తే ఇప్పటికీ అది అమల్లో ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ వల్ల గ్రామ స్థాయిలో పాలన వికేంద్రీకరణ జరిగి ప్రజల సమస్యలు సత్వరం పరిష్కారం అవుతున్నట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. బిరదవోలు పంచాయతీలో రూ.7.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇందులో సచివాలయ, ఆర్బీకే భవనాలతోపాటు, సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు ఉన్నాయన్నారు. రూ.2 కోట్లతో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీటిని అందజేయబోతున్నట్లు తెలిపారు.

పనులు పూర్తి చేయించా

టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన నాయకుడు అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేసి వెళ్తే తాము వచ్చి నిధులు విడుదల చేసి పనులను పూర్తి చేయించినట్లు కాకాణి వెల్లడించారు. చాటగొట్ల నుంచి బిరదవోలు రోడ్డును నిర్మిస్తామని, ఇందుకు సంబంధించిన నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు వల్ల నెల్లూరు నుంచి బిరదవోలు, మనుబోలు మండలాల పల్లెల నుంచి నెల్లూరుకు వెళ్లే ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్య గౌడ్, సర్పంచ్ బడుగు వెంకటరమణమ్మ, ఇంద్రసేన్‌గౌడ్, బడుగు శ్రీనివాసులు, వెన్నపూస దయాకర్ రెడ్డి, ఆకుల గంగిరెడ్డి, అక్కెం బుజ్జిరెడ్డి, వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, బడుగు శ్రీహరి, పోసిన చిన్నబ్బయ్య, కండే రమణయ్య తదతరులు పాల్గొన్నారు.

మట్టి తరలించేందుకు అనుమతుల్లేవు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో చెరువులు, రిజర్వాయర్ల నుంచి మట్టిని తరలించేందుకు జలవనరుల శాఖ నుంచి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్లు, పోలీసులు, గనుల శాఖాధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని మట్టి అక్రమ రవాణాను నివారించాలని తెలియజేశారు.

రేపు పీఎస్, బీఎస్ పరీక్షలు

- రెండు సబ్జెక్ట్‌లకు ఒకే ప్రశ్నపత్రం
- విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- డీఈఓ గంగాభవాని



నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఈనెల 13వ తేదీన ఫిజికల్ సైన్స్ (పీఎస్), బయలాజికల్ సైన్స్ (బీఎస్) పరీక్షలు జరుగుతాయని డీఈఓ గంగాభవాని తెలిపారు. నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లోని పరీక్షల విభాగం కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకే ప్రశ్నపత్రంలో పీఎస్, బీఎస్ సైన్స్ ప్రశ్నలు ముద్రించబడి ఉంటాయన్నారు. పార్ట్ ఏలో ఫిజికల్ సైన్స్ ప్రశ్నలు 1 నుంచి 16 వరకు, 17 నుంచి 33 వరకు బయలాజికల్ సైన్స్ ప్రశ్నలు ఉంటాయన్నారు. జవాబులు రాసేందుకు విడివిడిగా ఓఎంఆర్ షీట్లు ఇస్తామన్నారు. ఒక్కో షీట్‌లో 12 పేజీలు ఉంటాయని, వీటిని విద్యార్థికి ఒకేసారి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఫిజికల్ సైన్స్ ఓఎంఆర్ షీట్‌పై పేపర్ కోడ్-19, పేపర్ పేరు సైన్స్ పీ-1 అని, బయలాజికల్ సైన్స్ ఓఎంఆర్ షీట్‌పై పేపర్ కోడ్-20, పేపర్ పేరు సైన్స్ పీ-2 అని ముద్రించబడి ఉంటుందన్నారు. విద్యార్థులు రెండు సబ్జెక్ట్‌లకు సంబంధించి సమాధానాలు రాసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష ప్రారంభానికి ముందు ఇన్విజిలేటర్లు విద్యార్థులకు రెండు పేపర్లపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రామారావు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 863 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 863 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి డీసీపల్లి క్లస్టర్ పరిధిలోని గ్రామాల నుంచి 911 బేళ్లు రాగా వాటిలో 863 బేళ్ల కొనుగోలు చేశారని తెలియజేశారు. మిగిలిన 48 బేళ్లలో 12 నోబిడ్, 23 ఆర్‌ఆర్, 13 సీఆర్‌గా గుర్తించామన్నారు. వేలంలో 1,15,411 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.2,22,26,492ల వ్యాపారం జరిగింది. ఒక కిలోకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.180, సగటు ధర రూ.192.58 నమోదైంది. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.







కరోనా వైద్యానికి సిద్ధం : నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సిద్ధంగా ఉన్న జగనన్న ప్రాణవాయువు ప్లాంట్, కరోనా వార్డు , ప్లాంట్‌లో ఆక్సిజన్ సిలిండర్లను తనిఖీ చేస్తున్న సిబ్బంది, కరోనా బాధితులకు చికిత్స చేసేందుకు సిద్ధంగా ఉన్న వైద్యులు - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా

17 నుంచి పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ శిక్షణ తరగతులు



నెల్లూరు(టౌన్): ఈ నెల 17వ తేదీ నుంచి ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచితంగా పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లోని పరీక్షల విభాగం కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించిన వాల్‌పోస్టర్లను డీఈఓ గంగా భవాని చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి యశ్వంత్, నాయకులు బాలాజీ, రాహుల్, సాయి, నరసింహ, నవీన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నాగభైరవ సాహితీ పురస్కారాలకు కథా సంపుటాల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): నాగభైరవ సాహితీ పురస్కారం–2023 కోసం ముద్రిత కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు నాగభైరవ సాహిత్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2022 మధ్య ప్రచురితమైన కథా సంపుటాలను పోటీకి పంపాలని తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు రాష్ట్రేతరులు, విదేశాల్లో స్థిరపడిన వారు ఎవరైనా తమ ముద్రిత కథా సంపుటాలను పోటీకి నాలుగేసి ప్రతుల చొప్పున ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ లోపు పంపాలని తెలిపారు. కథా సంపుటాలను డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 202, శ్రీవెంకటసాయి రెసిడెన్సీ, 2వ లైను, రామయ్యనగర్, ఒంగోలు–523 002, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునామాకు పంపాలని తెలిపారు. వివరాలకు 98497 99711 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కథా సంపుటాల రచయితలను ఈ ఏడాది ఆగస్టు 20న ఒంగోలులో జరిగే సభలో ఘనంగా సత్కరించి ప్రోత్సాహకంగా రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

వేర్వేరు కేసుల్లో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను మంగళవారం వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు పాతకక్షల నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ రాత్రి వనంతోపు సెంటర్‌కు చెందిన శివమణితోపాటు అతని అక్కపై అదే ప్రాంతానికి చెందిన తిరుపాల్ తన స్నేహితుడైన పెంచలయ్య మరో బాలుడితో కలిసి హత్యాయత్నం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి మంగళవారం నిందితులను అరెస్ట్ చేశారు.

పోక్సో కేసులో..

వేదాయపాళెం పోలీసులు పోక్సో కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. నగరానికి చెందిన ఓ మహిళకు భర్త చనిపోయాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉండగా ఇద్దరికి వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఇళ్లలో పాచి పనులు చేసుకుంటూ చిన్న కుమార్తెతో కలిసి నివాసం ఉంటోంది. చిన్న కుమార్తెను ఆమె రెండో అక్క సాయంతో కదిరికి చెందిన మనోజ్ అనే యువకుడు గత నెల 28వ తేదీన తన వెంట తీసుకెళ్లాడు. బాధిత తల్లి ఆమె కోసం గాలిస్తుండగా ఈ నెల ఒకటో తేదీన మనోజ్ బాలికను ఇంటి వద్ద వదిలివెళ్లాడు. తల్లి కుమార్తెను ఆరా తీయగా తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకున్నాడని, అక్క సహకారంతో మనోజ్ తనను తీసుకెళ్లాడని చెప్పింది. ఈ మేరకు బాధిత తల్లి ఈ నెల 7న వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బాలిక అక్కతోపాటు మనోజ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. మంగళవారం నిందితులిద్దరినీ అరెస్ట్ చేశారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
- ఇన్‌చార్జి కలెక్టర్, ఆర్డీఓలతో కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, పక్కన ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్ తదితరులు

ఆత్మకూరు: రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అన్ని మండలాల అధికారులతో జిల్లాస్థాయి అధికారులు సమీక్ష నిర్వహించి పరిష్కరించేలా డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, ఆర్డీఓ సాధు కరుణకుమారిలతో కలిసి మంగళవారం రెవెన్యూ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో అనేక రెవెన్యూ సమస్యలు తమ దృష్టికి రావడంతో ఈ ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యను ఎన్ని రోజుల్లో పరిష్కరించేది బాధితులకు తెలిపేలా ప్రతి నెలా ఇలాంటి సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దశాబ్దాల తరబడి రైతులు ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీఓ నంబర్ 163ను విడుదల చేయడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో 17 వేల ఎకరాల్లో చుక్కల భూముల సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. ఆ రైతులకు పాసుపుస్తకాలు, రుణాలు మంజూరయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.

తప్పులు చేస్తే బాధ్యత వహించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు మండలాల్లో భూముల విషయంలో తప్పులు చేస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో జీఓ నంబరు 163 ద్వారా చుక్కల భూ సమస్య పరిష్కారం అయిందని, 47 వేల ఎకరాల రైతులకు మేలు చేకూరిందని తెలిపారు. మరో 4, 5 వేల ఎకరాలకు మాత్రమే సాంకేతిక సమస్యతో చుక్కల భూముల విముక్తి కలగలేదని, త్వరలో అవి పరిష్కారమవుతాయని తెలిపారు. త్వరలో 8వ విడత భూ పంపిణీ జరగనుందని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లేని భూములను గుర్తించి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కాగా మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లో భూ సమస్యలు అధికంగా ఉండడం, కొన్ని చిక్కుముడులు ఉండడంతో 22వ తేదీన ఆ రెండు మండలాలకు ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మర్రిపాడు మండలంలోని ఓ భూవివాదానికి సంబంధించి తహసీల్దార్ హేమంత్‌కు కొన్ని ఆదేశాలు జారీ చేశారు. ఆత్మకూరు మండలం అప్పారావుపాళెంలో ముస్లింలకు శ్మశాన వాటిక కోసం భూమి మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి కోరడంతో గ్రామంలో సర్వే చేసి ఆ మేరకు భూమిని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మహేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, ఎంపీపీలు కె.వేణుగోపాల్‌రెడ్డి, బి.పద్మజారెడ్డి, పి.సంపూర్ణమ్మ, జెడ్పీటీసీ సభ్యులు ఆర్.వెంకటసుబ్బారెడ్డి, పి.రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు ఎ.ఆనంద్‌రెడ్డి, సుబ్బినాయుడు, గంగవరపు శ్రీనివాసులునాయుడు, కంటాబత్తిన రఘురామిరెడ్డి, డాక్టర్ ఆదిశేషయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే స్ఫూర్తితో ముందుకు సాగుదాం

- ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్



కలెక్టరేట్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్ తదితరులు

నెల్లూరు(అర్బన్): సమ సమాజ స్థాపనకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహాత్మా జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. మంగళవారం జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా మినీబైపాస్ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఇన్‌చార్జి కలెక్టర్ పూలమాల వేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతిరావుపూలే జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమన్నారు. ఆనాడు సమాజంలోని రుగ్మతలు, దురాచారాలను రూపుమాపేందుకు పూలే పోరాటం చేశారని, విద్యతోనే సమ న్యాయం జరుగుతుందని ఆయన నమ్మారని తెలిపారు. అందుకే పూలే మార్గంలో నడవాలన్నారు. అనంతరం జ్యోతిరావుపూలే త్యాగనిరతిని స్మరించుకుంటూ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మేయర్ పొట్లూరి స్రవంతి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ వెంకటయ్య, ఐటీడీఏ పీఓ మందా రాణి, బీసీ సంఘాల నాయకులు ఆదిశేషయ్య, లీలాకృష్ణయాదవ్, శ్రీహరిరావు, మెప్మా పీడీ రవీంద్ర, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి కనకదుర్గాభవాని, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పార్కిన్‌సన్స్‌పై అవగాహన తప్పనిసరి

- డాక్టర్ బిందుమీనన్



నెల్లూరు(అర్బన్): పార్కిన్‌సన్స్(వణుకు) వ్యాధిపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్ట్, అపోలో ఆస్పత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్ పేర్కొన్నారు. ప్రపంచ పార్కిన్‌సన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక అపోలో ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇది మెదడుకు సంబంధించిన వ్యాధి అని, చేతులు వణకడం, నడక మారడం, మాట తడబడడం వంటి లక్షణాల ద్వారా పార్కిన్‌సన్స్ వ్యాధిగా గుర్తించవచ్చన్నారు. ఇది అంటువ్యాధి కాదని, మెదడులో డోపమైన్ ఉత్పత్తి లేకపోవడం ఈ వ్యాధికి ప్రధాన కారణమని తెలిపారు. ఈ వ్యాధి ప్రాణాంతకం కాదని, మంచి చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చికిత్స ద్వారా పార్కిన్‌సన్స్‌ను నియంత్రించవచ్చని, అయితే పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదన్నారు. డాక్టర్ సూచించిన మందులతోపాటు ఫిజియోథెరపి, స్పీచ్‌థెరపి, ఆక్యుపేషనల్ థెరపి, యోగా, కౌన్సెలింగ్, డ్యాన్స్ థెరపి వంటివి ఈ జబ్బును నియంత్రిస్తాయన్నారు. అపోలో ఆస్పత్రిలో పార్కిన్‌సన్స్‌కు మంచి వైద్యం లభిస్తుందన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



సలీమ్

బుచ్చిరెడ్డిపాళెం: భర్త అదృశ్యమైనట్లు మండలంలోని పాలినాయుడు చెరువు గ్రామానికి చెందిన షేక్ కమల్‌బీ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు గ్రామానికి చెందిన కమల్‌బీ సంవత్సరం క్రితం ఉపాధి కోసంగా కువైట్‌కు వెళ్లింది. రెండు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చిన ఆమె తన భర్త సలీమ్ లేకపోవడంతో చుట్టుపక్కల వారిని అడిగి చూసింది. ఆమె కువైట్‌కు వెళ్లినప్పుడే భర్త కూడా ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. రెండు నెలలుగా గాలించినా ఎలాంటి ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెన్నాలో బాలుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఆడుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు పెన్నానదిలో మృతదేహమై కనిపించడంతో కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసుల సమాచారం మేరకు.. ఈద్గామిట్టలో షేక్ ఇస్మాయిల్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు షేక్ అనుపా, షేక్ అక్బర్ అలియాస్ అషరఫ్(10) పిల్లలు. కుమారుడు అక్బర్ కనికల హాస్పిటల్ సమీపంలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో అక్బర్ ఆడుకుంటానని ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని కోసం గాలించారు. బంధువులు, స్నేహితులను ఆరా తీసినా జాడ తెలియరాలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇస్మాయిల్‌కు తెలిసిన మున్వర్‌బాషా పాత మున్సిపల్ కార్యాలయం వెనుక పెన్నానదిలో ఒంటిపై బట్టలు లేకుండా అక్బర్ మృతదేహం తేలియాడుతుండటాన్ని గమనించాడు. బాధిత తండ్రికి విషయాన్ని తెలియజేశాడు. ఇస్మాయిల్ వెంటనే పెన్నానది వద్దకు చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు ఆధ్వర్యంలో ఎస్సై రాజేష్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈతకెళ్లి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీల్డ్ టెండర్ల నిర్వహణ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆ ఆలయంలో పలు అంశాలకు సీల్డ్ టెండర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలంకరణ హక్కును శ్రీహరిబ్రహ్మ లైటింగ్ వారు రూ.2,96,000లకు దక్కించుకున్నట్లు తెలిపారు. డ్రామా స్టేజ్ ఏర్పాటు చేసే హక్కును నరసింహకొండకు చెందిన గాలి సుబ్బారావు రూ.39,999లకు, బ్యారికేడ్లు ఏర్పాటు చేసే హక్కును జొన్నవాడకు చెందిన సింగిరి శ్రీనివాసులు రూ.33,500లకు, కల్యాణం స్టేజీ ఏర్పాటు చేసే హక్కును జొన్నవాడకు చెందిన దాసరి సుబ్రహ్మణ్యం రూ.79,500లకు, వంట పాత్రలు సరఫరా చేసే హక్కును రూ.4,321లకు, క్లాత్ పందిరి ఏర్పాటు చేసే హక్కును 1 బిట్ రూ.399లకు, ఫొటోలు, వీడియోలు తీసే హక్కును రూ.లక్షకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన కొత్తపల్లి శ్రీనివాసులు దక్కించుకున్నట్లు తెలిపారు. ఆలయానికి రంగులు వేసేందుకు సరైన టెండర్ రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 108
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 192
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 214
లేయర్ చికెన్	: 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.35



జూదరులపై కేసు నమోదు

కావలి: పట్టణంలోని తుఫాన్‌నగర్ సమీపంలో బీరువాల ఫ్యాక్టరీ వెనుక ఉన్న చెట్ల మధ్య పేకాట స్థావరంపై కావలి సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.2,900 నగదు, 3 సెల్‌ఫోన్లు, 2 సెట్ల పేకలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.